ఆదిలాబాద్‌రూరల్: బోధన చేస్తున్న పాస్టర్

ఇచ్చోడ: సిరికొండలో సంబురాలు జరుపుకుంటున్న క్రైస్తవులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- సందడిగా మారిన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలు చేసిన క్రైస్తవులు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 25: క్రిస్మస్ వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని హోలీ ఫ్యామిలీ క్యాథలిక్, సీఎస్ఐ, మోరియా హార్వెస్ట్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా చర్చిల్లో పాస్టర్లు శాంతి సందేశమిచ్చారు. క్రీస్తు సర్వమానవాళికి చెందిన వారని, ఆయన జన్మించిన రోజు విశ్వానికే శుభదినమని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బోథ్/గుడిహత్నూర్/ఇచ్చోడ/తాంసి, డిసెంబర్ 25: బోథ్ మండల కేంద్రంతో పాటు పొచ్చెర క్రాస్‌రోడ్డు, కౌత(బీ), పొచ్చెర, గుడిహత్నూర్ మండల కేంద్రంతో పాటు మన్నూర్, ముత్నూర్, డోంగర్‌గామ్, గురుజ, లింగాపూర్, ఇచ్చోడ, సిరికొండ, తాంసి, తలమడుగు మండలాల్లోని గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్ పఠించారు. అనంతరం ఏసు ప్రభువును కొలుస్తూ భక్తి గీతాలు ఆలపించారు. అర్ధరాత్రి సమయంలో కేక్ కట్ చేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఇంద్రవెల్లి/నార్నూర్, డిసెంబర్ 25 : ఇంద్రవెల్లి మండల కేంద్రంతో పాటు గౌరాపూర్, దేవాపూర్, ముత్నూర్, శంకర్‌గూడ, కేస్లాగూడ, గలియబాయితండా, ఇన్‌కర్‌గూడ, రమాయినగర్, మిలిండ్‌నగర్, హీరాపూర్, భీంనగర్, నార్నూర్ మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంద్రవెల్లిలోని హోలీ ట్రినిటీ, మిలిండ్‌నగర్, దేవాపూర్ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో చర్చిల పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : హోలీ ట్రినిటీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఉట్నూర్, డిసెంబర్ 25: పట్టణంలోని సెంట్‌పాల్, సీఎస్ఐ చర్చిల్లో నాయకులు కేక్‌చేసి క్రైస్తవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నేరడిగొండ, డిసెంబర్ 25 : ఏసునాథుని జన్మదినాన్ని పురస్కరించుకొని నేరడిగొండలోని సీఎస్ చర్చిలో పాస్టర్ ఇజాన్ పీటర్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్‌లోని అంశాలపై క్రైస్తవులకు వివరించారు. పిల్లలు నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంట వెంకటరమణ, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 25: అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం మండలంలోని దంతన్‌పల్లి, లక్కారం గ్రామాల్లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. పాస్టర్లు ఏసుక్రీస్తు ప్రవచనాలు బోధించారు. కేక్ కట్ చేసి క్రైస్తవులకు ప్రభుత్వం ద్వారా వచ్చిన కానుకలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్, పాస్టర్ ఎస్ఎస్ అంద్రోస్, డెనియల్, రాజరత్నం, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దాసండ్ల ప్రభాకర్, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, క్రైస్తవులు, నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: సిరికొండలో క్రిస్మస్ కానుకలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నర్మదా పెంటన్న

ఉట్నూర్‌రూరల్: ప్రార్థనలో పాల్గొన్న భక్తులు

భవనం పూర్తయినా.. ఇంకా అద్దెలోనే

- నెలనెలా అద్దె చెల్లింపు
- ప్రజాధనం వృథా
- ఇది బోథ్ సబ్‌రిజిస్టార్ కార్యాలయం తీరు

బోథ్‌లో పూర్తయిన సబ్ రిజిస్టార్ కార్యాలయ భవనం

బోథ్, డిసెంబర్ 25 : బోథ్‌లో నిర్మించిన సబ్ రిజిస్టార్ కార్యాలయ భవనం ఇంకా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ప్రైవేట్ భవనంలో కొనసాగింపుతో నెలనెలా అద్దె చెల్లించాల్సి వస్తున్నది. ప్రజాధనం వృధావుతున్నది. బోథ్‌లో సబ్ రిజిస్టార్ కార్యాలయం ప్రారంభమైన నాటి నుంచి అద్దె భవనంలోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. దశాబ్దాల కాలంగా లక్షలాది రూపాయలు అద్దె రూపంలో చెల్లిస్తూ వస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం కార్యాలయ భవనం కోసం రూ. 65 లక్షలు మంజూరు చేసింది. ఇక్కడి నేల స్వభావం, డిజైన్ రూపొందించడంలో తేడా రావడంతో పనుల్లో కొంత ఆలస్యం జరిగింది. పనులు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ ఆలస్యమైనా పూర్తి చేయించారు. విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో రెండేళ్లుగా కార్యాలయ భవనం ప్రారంభానికి నోచుకోలేదు. ఇక్కడి నేల స్వభావంతో ఫ్లోరింగ్ కుంగిపోవడంతో మళ్లీ అవసరమైన మరమ్మతులు చేయించారు. భవనానికి విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కనెక్షన్ సైతం ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖ వారికి భవనాన్ని అప్పగించారు. అయినా వారు ఇంకా ప్రారంభానికి ఏర్పాట్లు చేయకపోవడంతో అద్దె భవనంలోనే కార్యకలాపాలు నడుస్తున్నాయి. దశాబ్దాల కాలంగా ప్రైవేట్ భవనంలో కొనసాగడంతో అద్దె రూపంలో ఇప్పటికే లక్షలాది రూపాయలు చెల్లించారు. కొత్త భవనం అందుబాటులోకి వచ్చినందున సంబంధిత శాఖ అధికారులు చొరవ తీసుకొని ప్రారంభించేలా చూడాలని బోథ్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

ప్రారంభ అనుమతి కోసం లేఖ రాశాం..

బోథ్‌లో నిర్మించిన సబ్ రిజిస్టార్ నూతన కార్యాలయ భవనం ప్రారంభ అనుమతి కోసం జిల్లా రిజిస్టార్‌కు లేఖ రాశాం. వారి నుంచి అనుమతి రాగానే ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు చేస్తాం. ఇటీవల భవనాన్ని మాకు కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు అప్పగించారు.

- ఆర్ సాయినాథ్, సబ్ రిజిస్టార్, బోథ్

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

- నేటి నుంచి గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు

జాబ్‌కార్డులు చూపుతున్న ఉపాధి హామీ కూలీలు

ఇంద్రవెల్లి, డిసెంబర్ 25: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 2021-22 వరకు చేపట్టిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్, కేస్లాగూడ, గిన్నేరా, అంజి, హర్కాపూర్, ముత్నూర్, తుమ్మగూడ, దేవాపూర్, దోడంద, గట్టెపల్లి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలు ఉపాధి పనులపై తనిఖీలు చేశారు. సామాజిక తనిఖీలో ఒక ఎస్ఆర్పీతో పాటు 12మంది డీఆర్పీలు, వీఆర్పీలు వేర్వేరుగా గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. పనులు చేసిన కూలీల వద్దకు వెళ్లి జాబ్‌కార్డులతో పాటు చేసిన పని దినాన్ని పరిశీలించారు. వారానికి ఒకసారి కూలీల చేతికి డబ్బులు వస్తున్నాయా లేదా అనేది అడిగి తెలుసుకున్నారు. అవినీతి అక్రమాలపై ఆరా తీశారు. గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీపై నేటి నుంచి గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామ సభలు ఉంటాయని ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీ స్వామ్య, వీఆర్పీలు మహేశ్వరి, సంధ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అడెల్లికి రాకపోకలు నిలిపివేత

బోథ్, డిసెంబర్ 25: మండలంలోని ధన్నూర్(బీ) మీదుగా రాఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతం గుండా అడెల్లి దేవస్థానానికి వెళ్లే రోడ్డులో బ్లాస్టింగ్ పనులు చేపడుతున్నందున వారం రోజుల పాటు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అటు వైపు వెళ్లే వారు జాగ్రత్త పాటించాలని సూచించారు.

మురళీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు

తాంసి, డిసెంబర్ 25 : మండలంలోని పొన్నారి మురళీకృష్ణ ఆలయంలో సుందర చైతన్యానంద జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాగుల పోచ్చన్న, ప్రధాన కార్యదర్శి పోతన్న, ప్రచార కార్యదర్శి ఓరగంటి రాజేశ్వర్, భగవాండ్లు, విలాస్ పాల్గొన్నారు.

జాతీయ అధ్యక్షుడిని కలిసిన నాయకులు

జాతీయ అధ్యక్షుడు ,ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి అంబేద్కర్ చిత్రపటం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం, డిసెంబర్ 25 : ఎంఐఎం పార్టీ జాతీయ అధ్యక్షుడు ,ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీలను హైదరాబాద్‌లోని దారుసలాంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్, నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసదుద్దీన్ ఓవైసీకి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులను అసదుద్దీన్ ఓవైసికి వివరించారు. త్వరలో జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం చేపడుతున్నామని వివరించగా ఓవైసీ అభినందించారు. కలిసిన వారిలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ నిమ్మల అశోక్, ఎంఐఎం పార్టీ టౌన్ జాయింట్ సెక్రటరీ షకీల్ అహ్మద్, ఎండీ సుభహాన్ ఉన్నారు.

కొత్త రేషన్ కార్డుల తర్వాతే ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

బోథ్, డిసెంబర్ 25: అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు జారీ చేసిన తర్వాతే ఆరు గ్యారంటీలు అమలు చేయాలని సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి షేక్ షాకీర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బోథ్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28 నుంచి ఐదు గ్యారంటీలు అమలు చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. తెల్ల రేషన్ కార్డులున్న వారు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులని ప్రకటించిందన్నారు. అర్హులై ఉన్నా తెల్లరేషన్ కార్డులు లేని వారు నష్టపోతారన్నారు. కొత్త కార్డులు ఇచ్చాకే గ్యారంటీలు అమలు చేయాలన్నారు.

నేడు బోథ్ డివిజన్ కమిటీ ఎన్నికలు

బోథ్, డిసెంబర్ 25: ఆదివాసీ హక్కుల పోరాట సమితి బోథ్ డివిజన్, మండల కమిటీల ఎన్నికలు మంగళవారం ఇంద్రవెల్లిలోని స్థూపం వద్ద నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధ్యక్షుడు రామెల్లి భోజన్న తెలిపారు. ఆదివాసీ గ్రామాల పటేళ్లు, రాయిసెంటర్ల సార్‌మేడీలు, మహాజన్లు, దేవరిలు, గ్రామాల పెద్దలు, నాయకులు, తొమ్మిది తెగలకు సంబంధించిన ఆదివాసీ విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

బోథ్‌కు శ్రీరామ జన్మభూమి తలంబ్రాల రాక

బోథ్, డిసెంబర్ 25: అయోధ్యలోని రామజన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ద్వారా దేశంలోని గ్రామాలు, నగరాలకు శ్రీరాముని తలంబ్రాల పంపిణీలో భాగంగా మంగళవారం బోథ్‌కు తలంబ్రాలు వస్తున్నట్లు శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్, విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. తలంబ్రాల శోభాయాత్ర సాయినగర్ నుంచి బోథ్‌లోని పలు వీధుల గుండా మార్కండేయ మందిరం వరకు ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు మంగళహారతులతో హాజరుకావాలని కోరారు. వచ్చే జనవరి 1 నుంచి 15 వరకు ప్రతి గడపకు తలంబ్రాలు అందించడం జరుగుతుందని తెలిపారు.

జనవరి 2వ తేదీలోపు టెండర్ల స్వీకరణ

ఉట్నూర్, డిసెంబర్ 25 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి విద్యార్థిని, విద్యార్థులు 2023-24విద్యా సంవత్సరానికి యూనిఫాం కుట్టుకు ఆసక్తి, యూనిఫాం కుట్టుటలో అనుభవం గల వారిచే సీల్డ్ టెండర్లను కోరతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారం ధర రూ.500, యూనిఫాం కొలతలు, వాటి వివరాలు గిరిజన ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం) ఆదిలాబాద్ రీజియన్ ఉట్నూర్ నందు లభించును. టెండర్‌ఫారం తేదీ ఈ నెల 27వ తేదీ నుంచి జనవరి 2వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు.

డీసీసీబీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి గణేశ్ యాదవ్

జైనథ్, డిసెంబర్ 25: పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన అడ్డి భోజారెడ్డి డీసీసీబీ చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పులివేణి గణేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి జోగు రామన్న సహకారంతో పదువులను అనుభవించారని గుర్తు చేశారు. తన స్వార్థం కోసం పార్టీని వదలివెళ్లడం తగదన్నారు.ప్రజల తీర్పును శిరసావహిస్తూ, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఆరు గ్యారంటీ పథకాలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ దేవన్న, బీఆర్ఎస్ నాయకులు జగదీశ్ రెడ్డి, లచ్చారెడ్డి పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి

ఆదిలాబాద్ రూరల్, డిసెంబర్ 25 : దేశానికి సుస్థిర పాలన అందించిన ఘనత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయికి దక్కుతుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం వాజ్‌పేయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

క్రీడా కిట్లు అందజేత

క్రీడా కిట్లు అందజేస్తున్న జడ్పీటీసీ, సర్పంచ్

భీంపూర్,డిసెంబర్ 25 : భీంపూర్ మండలం కామట్‌వాడ గ్రామంలో సోమవారం జడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు తాటిపెల్లి రాజు, సర్పంచ్ తాటిపెల్లి లావణ్య యువజన సంఘాలకు నాలుగు క్రీడా కిట్లను అందజేశారు. గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలనే కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామానికి క్రీడా కిట్లు కేటాయించిందని జడ్పీటీసీ రాజు గుర్తుచేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి పల్లకీ శోభాయాత్ర

నేరడిగొండ, డిసెంబర్ 25 : మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి పల్లకీ శోభాయాత్ర సోమవారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప ఆలయం నుంచి పల్లకీ శోభాయాత్ర ప్రారంభం కాగా మహిళలు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాన వీధులగుండా శోభాయాత్ర కొనసాగింది. పల్లకీలో కొలువైన అయ్యప్పను భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సన్నిదానం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వడూర్, తేజాపూర్, బుగ్గారం గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఎంపీపీ రాథోడ్ సజన్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్ పెంట వెంకటరమణ పాల్గొన్నారు.

నేరడిగొండ: పల్లకీ శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు

అరట్టు ఉత్సవం

ఉట్నూర్, డిసెంబర్ 25: మండల కేంద్రంలో అయ్యప్ప దీక్షాపరులు అరట్టు ఉత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఆలయం నుంచి అయ్యప్ప స్వామి, కుమార స్వామి, వినాయక ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిర్మల్ జిల్లాలోని బాదంకుర్తి గంగలో అభిషేకాలు చేసి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అర్చకుడు దీపక్ దూబే, భక్తులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో అవకాశం

- తుది గడువు జనవరి
- అర్హులు సద్వినియోగం చేసుకోవాలి : అధికారులు

దస్తురాబాద్, డిసెంబర్ 25 : ఓటు హక్కు నమోదు కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. త్వరలో పంచాయతీ, లోక్ సభ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఓటరు నమోదు చేపట్టింది. ఓటరు నమో దు, సవరణ ప్రక్రియ ప్రారంభం కాగా ఫిబ్రవరిలో తుది జాబితా ప్రకటనతో ముగియనున్నది. ఈ సందర్భంగా 2024 జనవరి 1 వ తేదీ లోపు 18ఏండ్లు నిండిన, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు మరో దఫా అవకాశం కల్పించింది. కాగా మండలంలో 20 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి 18 ఏండ్లు నిండిన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మరణించిన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగించడంతోపాటు చేర్పులు, మార్పులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఫాం-6కి దాదాపు 90, ఫాం-7కి 80, ఫాం-8కి 20 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం మండలంలో 12,637 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 6173 మంది పురుషులు, 6464 మంది స్త్రీలు ఉన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో లోక్ సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో మళ్లీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

ఇదీ షెడ్యూల్..

2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఫారం-6 ద్వారా నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జనవరి 6న ముసాయిదా జాబితా, ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. ముసాయిదాలో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాల స్వీకరణనకు అవకాశం ఉంటుంది. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ ప్రక్రియ కొనసాగుతుండంతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. బీఎల్వోల వద్ద, ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పకడ్బందీగా ఓటు హక్కు నమోదుకు చర్యలు

ఓటు హక్కు నమో దు కోసం కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. 2024 జనవరి 1వ తేదీ వరకు 18 ఏండ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి. ఇంటింటికీ బీఎల్వోలు వస్తారు. ఫారం 6 ద్వారా బీఎల్వోల వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. ఈ అవకాశాన్ని వయోజనులు సద్వినియోగం చేసుకోవాలి. చేర్పులు, మార్పులు చేసుకోనే వారు బీఎల్వోల వద్ద దరఖాస్తు చేసుకోవాలి.

- ఎండీ జాకీర్, తహసీల్దార్(దస్తురాబాద్)